క్లుప్తంగా

గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



నందిగామ రూరల్: వ్యాధులు ప్రబలకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు ఎంపీడీవో ప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని పెద్దవరం, లింగాలపాడు గ్రామాల్లో బుధవారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మురుగు కాలువలు, నీటి నిల్వ ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాలను గుర్తించి దోమలు వ్యాప్తి చెందకుండా ఎబేట్ మందును పిచికారీ చేయించామని ప్రసాదరావు తెలిపారు. మురుగు కాలువల్లో పూడిక తీత పనులను చేపట్టినట్లు ఆయన వివరించారు. డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శులు జనార్ధన్ కుమార్, సీతారామిరెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మాస్టర్ ప్లాన్‌పై అవగాహన

జగ్గయ్యపేట అర్బన్: ఏపీ సీఆర్డీయే(క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ) వారు వారి పరిధిలో ఉన్న మున్సిపాలిటీల్లో మాస్టర్ ప్లాన్ తయారు చేయడానికి మెస్సర్స్ ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ లిమిటెడ్ అను సంస్థకు బాధ్యతలు అప్పటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు సంస్థ అధికారులతో ప్రత్యేక సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు బుధవారం తెలిపారు. సమావేశంలో మాస్టర్ ప్లాన్ గురించి అవగాహన కల్పించడంతో పాటు సలహాలు, సూచనలు స్వీకరించనున్నామని వివరించారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు, సీఆర్డీయే అధికారులు పాల్గొంటారని తెలిపారు. కావున పట్టణ ప్రజలు, ఎల్‌టీపీలు, గ్రూఫ్ హౌస్ బిల్డర్లు తదితరులు పాల్గొనవలసిందిగా కోరారు.

మిర్చిలో జెమినీ వైరస్‌ను అదుపు చేయాలి



గండ్రాయి(జగ్గయ్యపేట): మిర్చి పంటలో పురుగులు, తెగుళ్లపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వేవీకే కో–ఆర్డినేటర్ రవికిషోర్ పేర్కొన్నారు. గ్రామంలోని సచివాలయంలో బుధవారం మిర్చి పంటలో సమగ్ర యాజమాన్య పంటలపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మిర్చిలో జెమినీ వైరస్‌ను అదుపులో ఉంచడానికి వేపనూనె తగినంత పిచికారీ చేయాలన్నారు. ముఖ్యంగా ఎకరాకు 30 జిగురు అట్టలను మొక్కకు అడుగు ఎత్తులో అమర్చుకోవాలన్నారు. కంచ పంటలను మిర్చిలో వేయడం వల్ల రసం పీల్చే పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చన్నారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మీ, శాస్త్రవేత్తలు లక్ష్మీకళ, జశ్వంత్ రెడ్డి, మురళీకృష్ణ, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'న్యాయ సహాయం ద్వారా అందరికీ న్యాయం'



నందిగామ టౌన్: ప్రజలందరికీ ఎటువంటి తారతమ్యం లేకుండా సమానంగా న్యాయ సేవలందితేనే న్యాయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, 16వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పగడాల శ్రీనివాసరావు బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయ సహాయం ద్వారా అందరికీ న్యాయం అనే కార్యక్రమంపై పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో మండల లీగల్ సర్వీస్ పరిధిలోని ప్రజలు, కవులు, కళాకారులు, యువత, విద్యార్థులు స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు పాల్గొనవచ్చని తెలిపారు. ఫొటోగ్రఫీ, వీడియోలు, పెయింటింగ్‌లను వేసి అక్టోబరు మూడో తేదీలోగా మండల లీగల్ సర్వీస్ కమిటీ కార్యాలయంలో అందించాలని సూచించారు.

ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు

నందిగామ రూరల్: గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే నిజమైన అభివృద్ధి సాధించినట్లని ఎంపీడీవో ప్రసాదరావు పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో ఎంపీపీలు, ప్రజా ప్రతినిధులు, గ్రామ కార్యదర్శులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ పెసరమల్లి రమాదేవితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళికా బద్ధంగా పని చేసి పేదరిక నిర్మూలనతో పాటు ఆరోగ్యవంతమైన గ్రామాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. అనంతరం నాణ్యమైన విద్యనందించే గ్రామాలు, నీరు సమృద్ధి గల గ్రామాలు, సామాజిక భద్రత, సామాజిక న్యాయ గ్రామాలు, సుపరిపాలన గ్రామాలు, తదితర అంశాలపై శిక్షణనిచ్చారు.

అన్నపూర్ణేశ్వరిగా అమ్మలగన్నమ్మ

దసరా శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాల్లో కొలువైన దుర్గమ్మ బుధవారం శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. లోకనాయకిని చూడటానికి భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పొంగళ్లు, పులిహోరను జగన్మాతకు నైవేద్యంగా సమర్పించి తల్లిముందు ప్రణవిల్లారు.

- మూడో రోజూ అమ్మకు విశేష పూజలు
- ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- జగన్మాత నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణాలు



వత్సవాయి మండలం దేచుపాలెంలో అన్నపూర్ణమ్మగా జగన్మాత

వత్సవాయి: శరన్నవరాత్రుల్లో భాగంగా మూడో రోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాల్లో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహాలను మాతాన్నపూర్ణేశ్వరిగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చుని పూజా క్రతువులు పూర్తిచేశారు.

నందిగామ రూరల్: శరన్నవరాత్రి మహోత్సవాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. మండలంలోని అంబారుపేటలో కొలువైన సత్యమ్మ అమ్మవారిని ఆలయ అర్చకులు గాయత్రీదేవిగా అలంకరించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో సీతారావమ్మ, ఆలయ చైర్మన్ మంచాల మాధవరావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పల్లగిరి గట్టు త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న కనకదుర్గ, కనక మహాలక్ష్మీ, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చందాపురంలో ఏర్పాటు చేసిన దుర్గామాత శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు.

నందిగామ టౌన్: రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శకశ్యామలాంబ అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ, మరిడీ మమాలక్ష్మీ అమ్మవారిని ఆలయ అర్చకులు అన్నపూర్ణాదేవిగా అలంకరించి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలలో ఆయా ఆలయాల ఈవోలు, నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీ దుర్గామల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో..

పెనుగంచిప్రోలు: తూర్పు బజారులోని శ్రీ దుర్గా మల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలోని ఉత్సవాల్లో భాగంగా విశేష కుంకుమార్చన నిర్వహించారు. పడమట బజారు బీసీ కాలనీలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు, భవానీ దీక్ష దారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి నమోస్తుతే..

కంచికచర్ల: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా కొలువైన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారిని మంగళగౌరీదేవిగా అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఫైర్‌స్టేషన్ రోడ్డులో భక్తులు ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకారం చేసి విశేష పూజలు చేశారు.

వీరులపాడు: మండలంలోని నరసింహారావుపాలెంలో కొలువైన అమరలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అల్లూరు గ్రామంలోని సీతారామచంద్ర స్వామి సహిత మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త అల్లూరు భాస్కరరావు, అంజనాదేవి దంపతులు అమ్మవారికి నూతన వస్త్రాలు అందజేసి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

హోమం కార్యక్రమంలో భక్తులు..



శ్రీ చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి



శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో చండీ హోమం

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక నకాశిబజారులో వేంచేసియున్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీ చండీ మూలమంత్ర సహిత రుద్రహోమము, కుంకుమ పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. అద్దాలబజారులో ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో సామూహిక కుంకుమార్చన, సాయంత్రం శ్రీనటరాజ నాట్యాలయం వారితో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. దుర్గాపురంలోని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీగాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం(పెద్ద శివాలయం)లో అమ్మవారిని శ్రీఅన్నపూర్ణాదేవిగా అలంకరించారు.



కాళికాదేవి నృత్యప్రదర్శన

అమ్రితసాయిలో సంబరాలు..

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో దసరా ఉత్సవాలు బుధవారం జరిగాయి. కళాశాల కరస్పాండెంట్ కె.రామ్మోహనరావు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. విద్యార్థులతో పాటు మహిళా అధ్యాపకులు బతుకమ్మను ఏర్పాటు చేసి ప్రత్యేక పాటలు పాడి నృత్యప్రదర్శన చేశారు. అనంతరం అమ్మవారి కాళికాదేవి అవతారంతో విద్యార్థులు ప్రదర్శన చేశారు.

జగ్గయ్యపేట: మండలంలోని తిరుమలగిరి గ్రామంలోని దుర్గామల్లేశ్వర స్వామి, ముక్త్యాల భవానీ ముక్తేశ్వర స్వామి వారి ఆలయంలోని విగ్రహాన్ని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. షేర్‌మహ్మద్‌పేట, చిల్లకల్లు, గౌరవరం, బండిపాలెం గ్రామాలలోని విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



గాయత్రీదేవిగా అంబారుపేట సత్యమ్మ అమ్మవారు



శాకంబరిగా దర్శనమిస్తున్న చందాపురం దుర్గామాత



అన్నపూర్ణాదేవిగా మరిడీ మహాలక్ష్మీ అమ్మవారు



నందిగామ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో..



ముక్త్యాలలో అన్నపూర్ణాదేవి



కంచికచర్ల కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో..



అన్నపూర్ణాదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు



తిరుమలగిరిలో అన్నపూర్ణాదేవిగా దుర్గాదేవి

వైభవంగా బతుకమ్మ సంబరాలు



పెద్ద శివాలయంలో బతుకమ్మ ఉత్సవాలు



లింగాలపాడు గ్రామంలో బతుకమ్మలతో మహిళలు

పెనుగంచిప్రోలు: మండలంలో బతుకమ్మ సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి పెనుగంచిప్రోలు శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం, శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, లింగగూడెం, ముచ్చింతాల గ్రామాల్లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.

వత్సవాయి: గ్రామాల్లో బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. సాయంత్రం సమయాల్లో మహిళలు రంగు రంగు పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒకచోట చేర్చి బతుకమ్మ పాటలతో ఆడిపాడుతున్నారు. అనంతరం బతుకమ్మలను స్థానికంగా ఉన్న చెరువులు, కాలువలు, మునేటిలో నిమజ్జనాలు చేస్తున్నారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో పలు చోట్ల నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. బుధవారం రాత్రి స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీచంద్ర మౌళీశ్వరస్వామి ఆలయం(పెద్ద శివాలయం)లో నిర్వహించిన వేడుకలు కన్నులపండువుగా సాగాయి. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కొప్పు అనంతరాజా, తులసీ సుబ్బరావు, నోముల శివకుమార్, యర్రా శ్రీనివాసరావు, చెక్కా సుధాకర్ పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని షేర్‌మహ్మద్‌పేట సమీపంలోని ఆటోనగర్‌లో మహిళలు, చిన్నారులు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సమీపంలోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

విశ్రాంత ఉద్యోగికి నివాళులు



ప్రభుదాసు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్ తండ్రి ఆర్‌అండ్‌బీ రిటైర్డ్ ఉద్యోగి దార్ల ప్రభుదాసు చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు బుధవారం నివాళులర్పించారు. 30వ వార్డు, అంబేడ్కర్‌నగర్‌లోని ప్రసన్నకుమార్ నివాసంలోని ప్రభుదాసు దశ దిన కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నంబూరి రవి, పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నర్సింహారెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షుడు రామిని ఉపేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): చిల్లకల్లు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రమేష్‌బాబు తెలిపారు. చిల్లకల్లు, తిరుమలగిరి, ధర్మవరప్పాడుతండా, వత్సవాయి మండలం భీమవరంలో అంతరాయం ఉంటుందన్నారు.

బస్సు నుంచి కిందపడి విద్యార్థినికి గాయాలు

కంచికచర్ల: ఆర్టీసీ బస్సులో నుంచి దిగేందుకు ప్రయత్నించిన ఓ విద్యార్థిని రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయాలైన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. కీసర గ్రామానికి చెందిన విద్యార్థిని మచిలీపట్నం పద్మావతి కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులు కారణంగా ఆమె కీసర వచ్చేందుకు విజయవాడ నుంచి జగ్గయ్యపేట ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సు ఎక్కింది. ఆ బస్సు కీసరకు స్టాప్ లేకపోవడంతో రిక్వెస్ట్‌గా ఆపుతుంటారు. ఆ బస్సులో నుంచి ముగ్గురు ప్రయాణికులు ముందుగా దిగారు. కానీ విద్యార్థి బస్సు వెనుక సీట్లో కూర్చోడం వల్ల సకాలంలో దిగలేకపోయింది. కొంతదూరం వెళ్లిన తర్వాత బస్సు ఆపమని చెప్పింది. కండెక్టర్ ఆపమంటే ఆపుతానని.. లేకపోతే నందిగామలో దిగాలని డ్రైవర్ మందలించడంతో విద్యార్థి బస్సు ఫుట్‌పాత్‌పై కాలు పెట్టింది. వెంటనే బస్సు ఆపకపోయే సరికి రోడ్డుపై పడి గాయాలపాలయ్యింది. గమనించిన స్థానికులు నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

నందిగామ టౌన్: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని మున్సిపల్ కమిషనర్ లోవరాజు పేర్కొన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా క్లీన్ టార్గెట్ యూనిట్స్ ప్రదేశాలను గుర్తించి బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, పేపర్లు వంటివి వాడడం మానుకోవాలని తెలిపారు.

లోక్ కల్యాణ్ మేళా నేడు

జగ్గయ్యపేట అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జగ్గయ్యపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఉక్కు కళావేదికలో ఉదయం 7 గంటల నుంచి లోక్ కల్యాణ్ మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని అన్నారు. మేళాను వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం



కార్యక్రమంలో నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు



పాల్గొన్న జగ్గయ్యపేట వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఉదయం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్ వర్క్

పారిశుద్ధ్య కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం



కొండలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ పద్మకుమారి, రవికుమార్

పెనుగంచిప్రోలు: స్థానిక గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు పంద్రకోల కొండలు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ దంపతులు కొండలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గుజ్జర్లపూడి రాంబాయి, స్థానిక నాయకులు ఉదయబాబు, పంద్రకోల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): తల్లిపాలు అమృతంతో సమానమని వైద్యాధికారి నాగలక్ష్మీ అన్నారు. బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

జగ్గయ్యపేట అర్బన్: గత 6 నెలలుగా వాయిదాలు చెల్లించడంలేదంటూ తమకు నోటీసులు వస్తున్నాయని సామల సత్యావతి వాపోయారు. బుధవారం ఆమె మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. పట్టణ సమీపంలో 2018లో ప్రభుత్వం టిడ్కో గృహాల్లో తమను అర్హులుగా గుర్తించి గృహాన్ని మంజూరు చేశారని అన్నారు. 2023లో ఇంటి పట్టాను ప్రైవేటు బ్యాంకు వారు తమ వద్ద పెట్టుకుని బ్యాంక్ వారే ఆ పట్టాపై లోను తీసుకున్నారని తెలిపారు. ఆ లోను డబ్బులను బ్యాంక్ వారే ప్రభుత్వానికి కడుతున్నారని వివరించారు. మార్చి 1వ తేదీ నుంచి వాయిదాలు బ్యాంక్ వారు చెల్లించని కారణంగా తమకు నోటీసులు పంపారని వాపోయారు.

ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన

నందిగామ రూరల్: పోషకాహారం, రక్తహీనత నివారణ, ఆరోగ్యకర జీవనశైలిపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించడమే స్వస్థ్ నారీ.. స్వశక్తి పరివార్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వైద్యాధికారులు మనోజ్, విజయ్‌కృష్ణలు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగాలపాడు, గోళ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఐతవరం, దాములూరు గ్రామాల్లో బుధవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు, పిల్లలు, కౌమార బాలికల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు దూరమవడంతో పాటు ఆరోగ్యకర జీవనాన్ని సాగించవచ్చని తెలిపారు. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు గుడ్‌టచ్.. బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం మహిళలు, బాలికలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జ్యోతి, ఏఎన్ఎం మేరి సువార్త, వైద్యారోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్‌లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ముక్త్యాల రాజా పేరు పెట్టాలని వినతి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట–మాదిపాడు మధ్య నిర్మిస్తున్న వంతెనకు ముక్త్యాల రాజా పేరు నామకరణం చేయాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే సీఎం చంద్రబాబును కలిసి జగ్గయ్యపేట మండలం, ముక్త్యాల గ్రామం వద్ద కృష్ణానదిపై ఎన్టీఆర్ ముక్త్యాల–పల్నాడు జిల్లా మాదిపాడు మధ్య నిర్మితమవుతున్న వంతెనకు ముక్త్యాల రాజా పేరు పెట్టాలని చంద్రబాబును కోరారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి

సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): ప్రతి రైతు తమ పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.రామసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సుబ్బాయిగూడెం, కొళ్లికూళ్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాజశేఖర్, వెంకటరెడ్డి మిర్చి, పత్తి పొలాలను పరిశీలించి పలు పురుగులు, తెగుళ్ల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. పశుసంవర్ధకశాఖ డీడీఏ మోసెస్ వెస్లీ, వైద్యాధికారి పి.అనిల్, ఏడీఏలు వెంకటరావు, కృష్ణమూర్తి, ఏఈవో లక్ష్మణరావు పాల్గొన్నారు.